# తొలి మజిలీ



వాణిశ్రీ

"మాతో తిరగరాదూ కొన్నాళ్ళు. అ సంఘ్లనెన్ని కలు కూడా దగ్గర కొస్తున్నాయి. మంచి అనుభవం వస్తుంది కూడా! పార్టీ కార్యకర్తగా స్థిరపడితే చాలు—ఎప్పుడో ఒకప్పుడు చాన్స్ తగిలి ఏదో ఒక పదవి దొరుకుతుంది. చిన్న చిన్న అణాకానీ ఉద్యోగాల కోసం ఏం తిరుగుతావు, కూటికా... గుడ్డకా?" అన్నాడు మావయ్య.

సంగం మావయ్య గాంధేయవాది. గాంధీ లనే నమ్ముకుని పంచాయతీ సభ్యత్వం నుంచి ఎదుగుతూ సమితి అధ్యక్షుడు అయ్యాడు. ఈసారి ఎమ్మెల్యే సీటు ఖాయం అని అనుకుంటున్నారు. సంగమేశ్వరరావు అంటే జిల్లాలోనే గాక ఇటు హైదరాబాద్, అటు ఢిల్లీలోనూ పలుకు బడి, లవాడని అందరికీ తెలుసు.

చదువుపూర్తి చేశాక ఏం చెయ్యాలో తోచక ఏదో ఒక ఉద్యోగం దొరక్క పోతుందా అని ప్రయత్నాలు చేస్తున్నాను. మా అమ్మ పోరుతూనే ఉంది—'సంగం మావయ్యని అడగరా...ఏదొక ఉద్యోగం వేయిస్తాడు' అని. కాని, నాకే మనసు పీకుతూ ఉంది. నా ప్రవృత్తి దృష్ట్యా యాచన నా వల్ల అయ్యే పని కాదు. పర్లేనె అని మా అమ్మకు సమాధానం చెప్తూ తప్పుకుంటున్నాను.

ఏవో పార్టీ మీటింగులున్నాయని మావయ్య మా వూరికి వచ్చాడు. అట్లాగే చూసి పోదామని మా ఇంటికి వేం చేశాడు. భోజనాలయ్యాక నా ఉద్యోగం గురించి కదలేసింది అమ్మ.

అదుగో దానికి సమాధానమే మావయ్య సలహా!

నేను ఆలోచనలో పడిపోయాను. హటాత్తుగా రాజకీయాల్లోకి ప్రవేశించాలంటే భయం వేసింది. నేనేం ఎన్టీఆర్‌నా...ఒక్క హైజంప్ చేసి రంగ ప్రవేశం చేయడానికి?

"పొట్ట కోసినా అక్షరం ముక్క రానోళ్ళంతా పార్టీలో జేరిపోయి కంపు కొట్టిస్తున్నారు. నీలాంటి చదువుకున్న వాళ్ళు చేరితే పార్టీ బలపడుచుంది. దేశం బాగుండుతుంది. అందుకే నీ లాంటి కుర్రాళ్ళ కోసం యువజన పార్టీ పెట్టాం. అందులో జేరు ముందు. తరవాత చూద్దాం" అన్నాడు సంగం మావయ్య.

మా అమ్మ నా మవునం చూసి, "మావయ్య చెప్పిన ఉద్యోగంలో చేరు ముందు" అని హెచ్చరించింది.

నాకు నవ్వొచ్చింది.

"ఎందుకుర వెధవ నవ్వు" అని నన్ను కోప్పడి, "శిరా సంగం! అది మంచి ఉద్యోగమేనా. జీతం ఎంత ఇస్తారు?" అని మావయ్యని అడిగింది.

"అది ఉద్యోగం కాదు లేవే! పార్టీ. ఇప్పుడంతా టెయినింగ్ ఉంటుంది. ముందు ముందు బాగా డబ్బొస్తుంది లే!" అన్నాడు.

"మరిహానేం! డబ్బొస్తుంటే సరి ఏదైతేనేం?" అంది అమ్మ.

నాకు నవ్వాలో, ఏడవాలో తోచలేదు.

కాన్నైతే మావయ్య వెంబడి తిరగడమే మంచిదని పించింది—కొన్నాళ్ళు ఉద్యోగం లేదే అనే దిగులైనా

దూరంగా ఉంటుంది.

"గాంధీగారి గురించి బాగా చదువుకుని సాయంకాలం అట్నుంచి గాంధీ పార్కులోకి రా! నీతో ఉపన్యాసం ఇప్పిస్తాను" అని చెప్పి, నా సమాధానం కోసం ఎదురు చూడకుండా జీప్‌లో వెళ్ళిపోయాడు సంగం మావయ్య.

ఉపన్యాసం అనే సరికి నాలో ఉత్సాహం ఉప్పొంగి పొంగి పొర్లింది. ఒక్క గాంధీజీ గురించేం ఖర్మ! జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధి గురించి కూడా బ్రహ్మాండమైన ఉపన్యాసం తయారు చేశాను. గదిలో తలుపులు వేసుకుని అద్దం ముందు కూర్చుని కంఠతా పట్టాను.

సాయంకాలం గాంధి పార్కులో వేల కొద్దీ జనం బెల్లానికి పట్టిన ఈగల్లా ముసురుకొని ఉన్నారు. మా మావయ్యని పట్టుకునే సరికే తల ప్రాణం తోకకి దిగింది. వెంటనే నాకు చాటంత బాడ్జీ ఒకటి చొక్కాకి తగిలించారు.

తరవాత మంత్రి కోనయ్యగారు యువజనపార్టీకి ప్రారంభోత్సవం చేశారు. ఆయన తన సహజ గంభీర కంఠ స్వరంతో బ్రహ్మాండమైన ఉపన్యాసం దంచేశారు. యువజన పార్టీ ఉద్దేశాలు వెల్లడించారు. వరకట్నం నిషేధం, చెట్లు పెంచుట, వెట్టిచాకిరీ నిర్మూలన వగైరా అంశాలు అందులో ఉన్నాయి. యువజన పార్టీలో చేరిన సభ్యులంతా అన్యాయాన్ని ఎదుర్కొని పార్టీకి పేరు తేవాలని జనం కరతాళ ధ్వనుల మధ్య అభ్యర్థించారు.

ఉపన్యాసం అయ్యాక మంత్రి కోనయ్య గారు కారులో గెస్ట్‌హౌస్‌కి వెళ్ళిపోయారు. తరవాత కొందరు ఉపన్యాసాలు ఇస్తున్నారు కాని, జనం వినకుండా వెళ్ళిపోసాగారు.

యువజన పార్టీలో చేరదలచిన విద్యార్థికులైన యువకులంతా వెంటనే పార్టీ ఆఫీసుకు రావలసిందిగా మైక్‌లో ప్రకటించారు.

నేను మావయ్య వెంట జీప్‌లో ఎక్కి పార్టీ ఆఫీసుకు వెళ్ళాను. నేను యువజన పార్టీ సభ్యుడుగా నమోదయ్యాను. కార్యవర్గం ఎన్నికలో నన్ను ఎవరో జాయింట్ సెక్రెటరీ పదవికి ప్రతిపాదించారు. మరెవరో చప్పట్లు కొట్టారు. మావయ్య నన్ను వేదిక మీదకు లాక్కెళ్తూ, "అందరికీ నమస్కారాలు చెయ్యాలి" అంటూ చెవిలో గుసగుసలాడాడు.

నేను వణుకుతున్న కాళ్ళతో స్టేజి ఎక్కి అందరికీ నమస్కారం చేశాను.

అయ్యో! అలాగా నేను సంఘ సేవకుణ్ణి అయ్యాను.

● ● ●

"ఆర్నెల్లలో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయిగదా! అప్పుడు పిలిపిస్తాను" అని చెప్పి వెళ్ళిపోయిన మావయ్య మళ్ళీ రాలేదు.

ఆర్నెల్లు ఏం ఖర్మ? సంవత్సరం గడిచింది. యువజన పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శులు ఏం చేస్తున్నారో నాకు సమాచారం లేదు. మరి పార్టీ ఆదర్శాలు మాటేమిటి? అని ఎన్నోసార్లు ఆలోచించాను కాని, బుర్రకి ఎక్కలేదు.

ఇదిలా ఉండగా ఒక రోజు --

నేను అలవాటు ప్రకారం ప్లేగ్రౌండ్‌లో రవుండ్స్ కొట్టి ఇంటికి తిరిగి వస్తున్నాను.


అప్పుడే తెల్లవారుతోంది.

తూర్పు ఎర్రబడింది.

ఒక మేడ ప్రహరీ గోడ గేటుకు ఆనుకుని పదేళ్ళ పిల్ల పెద్దగా ఏడుస్తోంది.

చూడగానే ఆ పిల్ల ఆ ఇంట్లో పనిచేసే పిల్లయి ఉంటుందని గ్రహించాను. తైల సంస్కారం లేక రాగి రంగుకు మారుతున్న జుట్టు, మసి గుడ్డలవంటి చిరిగిన బట్టలు, కళా కాంతులు లేని ముఖంతో హృదయవిదారకంగా ఏడుస్తోంది ఆ పిల్ల.

ఎందుకు ఏడుస్తోందా అని చూస్తే ఏముంది! ఆ పిల్ల రెండు చేతుల మీదా కాల్చిన వాతలు స్పష్టంగా కనిపించాయి. ఆ పసిపాపను వాతలుపెట్టి హింసించిన వాళ్ళను పీక పిసికి చంపాలన్నంత ఆవేశం కలిగింది నాకు.




"ఏయ్ అమ్మాయ్! ఎవరు నీ కీ వాతలు పెట్టింది?" అని అడిగాను.

నే నలా అడగ్గానే ఆ పిల్లకి మరింత దుఃఖం వచ్చి బోరున ఏడుపు సాగించింది. నేను ఆమె తల మీద చెయ్యివేసి కళ్ళు తుడిచి బుజ్జగించాను.

"ఎవరమ్మా! నిన్నిలా కాల్చింది?" అని పదే పదే అడిగాను.

ఆమె ఏడుపు ఆపుకుంటూ వెక్కిళ్ళ మధ్య "అమ్మగారు" అంది.

"ఏ అమ్మగారు?" అన్నాను.

ఆమె చెయ్యెత్తి మేడవైపు చూపించింది.

నేను గేటు మీద నేమ్ బోర్డు చూశాను.

"అశోక్ కుమార్, బి. ఇ., అసిస్టెంట్ ఇంజనీర్" అని ఉంది.

'హోహో... ఇది ఇంజనీరుగారి సతీమణి నిర్వాకమా?' అనుకున్నాను.

ఎవరైతే నాకేం? పసిపిల్లతో వెట్టిచాకిరీ చెయించుకుంటూ ఉండటమే కాక, మానవత్వం మరిచిపోయి కాల్చి వాతలు పెట్టి హింసిస్తారా? ఎంత దారుణం? ఎంత క్రూరం? ఎంత రాక్షసత్వం? అసలావిడ మనిషేనా?

మంత్రి కోనయ్యగారు ఆ నాడు గాంధిపార్కులో చేసిన ఉపన్యాసం నన్ను ఉత్తేజితుణ్ణి చేసింది. యువజన పార్టీ జాయింట్ సెక్రెటరీ నన్న విషయం జ్ఞాపకం వచ్చి ఎంతో ధైర్యం కలిగింది. వెట్టిచాకిరీ నిర్మూలన మా పార్టీ సిద్ధాంతాలలో ముఖ్యమైనది కదా! నా కర్తవ్య నిర్వహణ నన్నా ఇంట్లోకి నడిపించింది.

పూల మొక్కలకి గొప్పులు తవ్వుతున్న మనిషి తలెత్తి చూసి, "ఏం కావాలండీ?" అన్నాడు.

"ఎవరయ్యా ఈ పిల్లకి వాతలు పెట్టింది?" అన్నాను కోపంగా.

"అదంతా మీ కెందుకండి? అది దొంగముండ. దొంగతిండి తింటుంటే మా అమ్మగారే భయపెట్టడానికి గరిట కాల్చి వాతలు పెట్టింది. అయినా, దారిన పోయే మీ కెందుకండి అయ్యన్నీ" అన్నాడు ఆ మనిషి.

"జాగ్రత్తగా మాట్లాడు?" పెద్దగా అరిచాను.

నా అరుపుకి వాడు హడలి పోయి పార క్రింద పడేసి "ఏంటి?" అన్నాడు.

"పళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు. నే నెవర్నో తెలుసా నీకు? తల్చుకున్నానంటే కటకటాల వెనక్కి తోయిస్తాను." కోపంతో అరిచాను.

అతను ఒక్క దెబ్బకి పరిగెత్తాడు.

అశోక్ కుమార్ కాబోలు—నోట్లో బ్రష్ పెట్టుకుని బైట కొచ్చాడు. లుంగీ, బనీనుతో ఉన్నాడు.

"ఏమిటి మిస్టర్! ఏమిటో గొడవ చేస్తున్నావట" అన్నాడు.

"ఎవరండీ ఈ పసిపాపను కాల్చి వాతలు పెట్టారు?" అన్నాను.

"నీకెందుకు? నువ్వెవరు?"

"నాకు కావాలి. పసిపాపతో వెట్టి చాకిరీ చేయించు కుంటున్నదే చాలక కాల్చి హింసిస్తారా? మనుషులు చేసే పనేనా ఇది?" కోపంతో రంకెలు పెట్టాను.

"యూ! మైండ్ యువర్ బిజినెస్. నువ్వెవరు నన్నడగడానికి...గెటవుట్!" అంటూ ఇంజనీరు గారు ఇంగ్లీషులో తగులుకున్నారు.

"నేను జాయింట్ సెక్రటరీ టూ యూత్ పార్టీ. ఐ విల్ సీ యువర్ ఎండ్ . . ." డాం డూమ్ అని నేనూ ఇంగ్లీషులో జవాబు ఇచ్చాను.

మా అరుపులు విని ఇంజనీరు భార్య, పిల్లలు ఇంట్లోనించి బైటకు వచ్చారు. వీధిలో జనం గేటు ముందు చేరారు.

నేనా పిల్లను రోడ్డు మీదకు తీసుకొచ్చి ఇంజనీరు భార్య చేసిన ఘాతుకాన్ని అందరికీ వివరంగా చెప్ప సాగాను. అంతా ఆ పిల్లమీద సానుభూతి చూపించారు.

ఈ గుంపు గొడవ చూసి ఇంజనీరు, ఆయన భార్య, పిల్లలు లోపల కెళ్ళి పోయి తలుపులు మూసుకున్నారు. వాళ్ళ నిర్లక్ష్య ధోరణి చూసి నాకు కడుపు మండిపోయింది.

నా కప్పుడు పత్రికా విలేఖరి పుల్లారావు జ్ఞాపకం వచ్చాడు. ఆ పిల్లను రిక్షాలో ఎక్కించి పుల్లారావు ఇంటికి వెళ్ళాను. పుల్లారావుకు జరిగిందంతా చెప్పాను. ఆ పిల్ల చేతి మీద వాతలు పడేట్లు ఫోటో తీయించి పట్టుకొస్తే పేపర్లో వేయిస్తానన్నాడు. తర్వాత ఆ పిల్లను ఇంటర్వ్యూ చేసి వివరాలు తెలుసుకున్నాడు.

ఆ పిల్ల పేరు దుర్గ. వాళ్ళది ఈ వూరు కాదు. సిరిపాలెం. ఇంజనీరుగారి భార్య పుట్టినిల్లు అది. దుర్గకి తల్లి చచ్చి పోయింది. తండ్రి రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఇక్కడ పని మనుషులు సరిగా ఉండడం లేదని ఆవిడ దుర్గని తీసుకొచ్చి పని చేయించుకుంటూంది. తిండి సరిగ్గా పెట్టదు. ఆకలేసి తను టేబుల్ మీద ఉన్న అరటి పండు తిన్నది. దొంగ తనంగా తింటావా? అని ఆవిడ కొట్టి వాతలు పెట్టి ఇంట్లో నుంచి గెంటి వేసింది.

"ప్రొద్దున్నే బ్రహ్మాండమైన న్యూస్ పట్టు కొచ్చావు, తమ్ముడూ!" అని పుల్లారావు నన్ను మెచ్చు కున్నాడు.

"ఇప్పుడు నేనేం చెయ్యాలి?" అని విలేఖరి సలహా అడిగాను.

"వెంటనే గవర్నమెంట్ హాస్పటల్ కి తీసుకెళ్ళి ట్రీట్ మెంటు ఇప్పించు. డాక్టర్ సర్టిఫికెట్ తీసుకో. తర్వాత పోలీసు కంప్లైంట్ ఇచ్చి, పిల్లని వాళ్ళ అధీనంలో ఉంచు. కేసు నడ స్తుంది" అన్నాడు పుల్లారావు.

"ఈ దెబ్బతో ఆ ఇంజనీరు గాడు ఉద్యోగం వూడిపోవాలి!" కోపంగా అన్నాను.

"శభాష్! యువజన పార్టీ వాళ్ళంటే అట్లా ఉండాలి" అన్నాడు విలేఖరి.

"ఇక చూడండి మన దెబ్బ! మీరు మాత్రం అన్నిడెయిలీల్లో వార్త పడేటట్లు చూడాలి" అన్నాను.

"అదేం భాగ్యం. నువ్వే చూస్తావుగా, తెలుగు లోనే కాదు—ఇంగ్లీషు పేపర్లలో గూడా బాక్సు కట్టించి మరీ వేయిస్తాను. దేశమంతా తెలిసి పోతుంది నీ పేరు" అన్నాడు పుల్లారావు.

నేను సంతోషంతో ఉబ్బి పోయి రొమ్ము విరుచుకుని రంగంలోకి దిగాను. ముందు మా అధ్యక్షుని, కార్యదర్శులను కలుసుకుని సంగతంతా చెప్పాను. నేను చేసిన పని వాళ్ళు మెచ్చు కున్నారు.

"పార్టీకి నిధులు లేవు గురూ! ఖర్చులు ఎట్లా?" అన్నాడు అధ్యక్షుడు.

"ఒక వంద పోతే పోయింది. ఆ ఇంజనీర్ సంగతి తేలిపోవాలి" అన్నాను ఆవేశంగా.

"వెరీగుడ్!" అన్నాడు కార్యదర్శి.

సరే, ముగ్గురం కలసి ఫోటో స్టూడియోకి బయల్దేరాం. కార్యదర్శి టిఫిన్ తినలేదన్నాడు. అధ్యక్షుడు కాఫీ త్రాగాలన్నాడు.

వచ్చేటప్పుడు పంచదార తెమ్మని మా అమ్మ ఇచ్చిన ఇరవై జేబులో ఉన్నాయి.

సరే కానివ్వమని హోటల్లో కెళ్ళాం. ఆ పిల్లకు గూడా ఇడ్లీ, దోశ ఇప్పించాను. ఆవురావురుమని




తిన్నది. పది రూపాయలు బిల్లు అయింది. స్టూడియో వాడొక పది లాగాడు.

తర్వాత ఆస్పత్రిలో కట్లు కట్టించాం. డాక్టర్ ముందు పసిగాడు. మా పార్టీ పేరు చెప్పి హడల గొట్టి సర్టిఫికెట్ రాయించాం. తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఇన్‌స్పెక్టర్ గారికి జరిగిందంతా చెప్పాం.

ఆయన అంతా విని అదంతా రాసివ్వమన్నాడు. నేను తెల్ల కాగితం తీసుకుని రాసి ఇచ్చాను.

"సరే మీరు వెళ్ళండి. మేం చూసుకుంటాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

● ● ● ●

మర్నాడు తెలుగు దిన పత్రికలలో దుర్గకి కాల్చి వాతలు పెట్టిన ఫోటో, వార్త ప్రముఖంగా పడింది.

నేను సంతోషం పట్టలేక పోయాను. యువజన పార్టీ జాయింట్ సెక్రటరీగా నాపేరు గూడా పడింది. మిత్రుల ఇళ్ళన్నీ తిరిగి వార్త చూపించాను.

"ఒరేయ్ భలే పని చేశావురా" అని అంతా నన్ను మెచ్చుకున్నారు.

పోలీసులు ఇంజనీర్ మీద కేసు పెడుతున్నారనీ, నేరం రుజువైతే ఉద్యోగం కాస్తా వూడి పోతుందనీ నేను అందరికీ చెప్ప సాగాను.

"అటు వంటి వాళ్ళకి శాస్తి జరగాల్సిందేలే" అన్నారు అంతా.

"మనం నడుం కట్టకపోతే దేశంలో వెట్టి చాకిరీ ఎట్లా పోతుంది?" అని ఉపన్యాసం దంచాను మిత్రుల ముందర.

"నీలాంటి వాళ్ళు వూరి కొకడుంటే చాలు—దేశంలో వెట్టి చాకిరీ ఎక్కడుంటుంది?" అని మిత్రులు నన్ను మెచ్చుకున్నారు.

నాకు ఎంతో గర్వం కలిగింది—యువజన పార్టీ ఆశయాలు నెరవేరుస్తున్నందుకు.

● ● ● ●

వారం గడిచి పోయినా, పోలీసులు కేసు పెట్టలేదు. ఇదుగో అదుగో అని చెప్తున్నారు నాకు. దుర్గనేమో సిరిపాలెం తండ్రి దగ్గరికి పంపించారట.

మా ప్రెసిడెంట్‌ని కలుసుకుని పోలీసులు చర్య తీసుకోవడం లేదని చెప్పి, ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించాలని నిర్ణయించుకుని డ్రెస్ చేసుకుని బయలు దేర బోతున్నాను.

అప్పుడు సాయంకాలం నాలుగు దాటింది.

మా ఇంటి ముందు జీప్ ఆగింది. ఎవరా అని చూద్దును గదా సాక్షాత్తు మా సంగం మామయ్యే దిగాడు. ఆ వెనుక మా అధ్యక్షుడు, కార్యదర్శి గూడా జీప్‌లో నుంచి వూడి పడ్డారు.

"రండి... రండి... కూర్చుందురుగాని..." అంటూ నేను కుర్చీలు వేస్తుంటే మామయ్య అన్నాడు—"నీ వల్ల నా పరువు పోయింది గదరా" అని.

నేను విస్తుపోయాను

"ఏం జరిగింది?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"గురూ! పొరపాటు జరిగి పోయింది" అన్నాడు అధ్యక్షుడు.

"ఏమిటి?" అన్నాను అయోమయంగా.

"ఆ ఇంజనీరు ఎవరో కాదు—మన మంత్రి కోనయ్య గారి సొంత అల్లుడు" అన్నాడు మా అధ్యక్షుడు, ఎంతో బాధ పడిపోతూ.

"అయితే ఏం?" అన్నాను.

"నీ మొహం. మన వాళ్ళ మీదే మనం కంప్లెయింట్ ఇచ్చు కుంటామా? పద ముందు జీప్ ఎక్కు. అన్నీ కుర్ర చేష్టలు, కోతి పనులూను!" అని విసుక్కున్నాడు మామయ్య.

"ఎక్కడికి?" అన్నాను.

"పోలీస్ స్టేషన్‌కు."

"ఎందుకు?"

"ఎందుకా—చేసిన వెధవ పనికి! పద . పద.. కేసు విత్‌డ్రా చేసుకున్నట్టు రాసివ్వాలి. ." అంటూ మామయ్య నా మెడ పట్టుకుని జీప్‌లోకి తోశాడు. ★


మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

# కేశవర్థినిని

చేర్చిన కొబ్బరినూనె

OBM 6119/IG




ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్థినిని కలపండి. తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి. ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము–కేశవర్థిని. వెంటనే ఒక బాటిల్ కేశవర్థినిని కొని వాడండి.




కేశవర్థిని ప్రోడక్స్ (మద్రాను)
మద్రాను-600 092